క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవ పూజలు



కృత్తివెన్ను: సీతారామచంద్రులు, వేణుగోపాల కృష్ణస్వామివార్ల 17వ వార్షిక మహోత్సవం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు వేడుకగా ఈ ఉత్సవాలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజలు సుదర్శన హోమం, శాంతి కల్యాణం మంగళవారం ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

153 మందికి వైద్య పరీక్షలు



పర్రచివర(నాగాయలంక): ఘంటశాల పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో మండలంలోని పర్రచివర శివారు పుల్లయ్యగారి దిబ్బ గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని నిర్వాహకులు స్థానిక మహిమాన్విత ప్రార్థనా మందిరం ప్రాంగణంలో జరిపిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నానికి చెందిన వైద్యురాలు డాక్టర్ యక్కటి ప్రవళిక నేతృత్వంలో ఆస్తమా, నడుము, మోకాళ్ల నొప్పులు సంబంధిత దీర్ఘకాలిక వ్యాధులు, బీపీ, మధుమేహం, ఆస్తమా, దగ్గు, జలుబు రోగులు 153 మందికి పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా పర్ణశాల ప్రార్థనా మందిరం ఆర్థిక సహకారంతో రూ.35 వేల విలువైన మందులు ఉచితంగా అందజేశారు. తోటి వారికి సాయం అందించాలన్న ఏసుక్రీస్తు సందేశం అనుసరించి వైద్యశిబిరం చేపట్టినట్లు సంస్థ నిర్వాహకులు పేర్కొన్నారు. పాస్టర్ పీఎస్.రాజు, గ్రామ పెద్దలు ఆరేవరపు నాగార్జున, కట్టా సత్యనారాయణ, దేవనబోయిన రాంబాబు, ఆరేవరప బసవేశ్వరరావు, కోటేశ్వరరావు, భిక్షం, రాంబాబు, దైవజనులు, సంఘస్తులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు

చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని శ్రీహరిహర పుత్ర క్షేత్రంలో ఆదివారం శ్రీరామ నవమి 16 రోజుల పండుగ సందర్భంగా అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు భానూ నంబూద్రి ఆధ్వర్యంలో స్వామివారి దివ్య అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: ఆది వెలమ సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులు, వితంతువులు, దివ్యాంగులకు సామాజిక పింఛన్ల ఆర్థిక సహాయాన్ని ఆ సంఘ నాయకులు ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. అది వెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోకా సూర్యప్రకాశరావు, కార్యదర్శి సూరత్ శ్రీకాంత్ పంపిన రూ.70 వేల మొత్తాన్ని నగదు రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ మొత్తాలను స్థానిక ఆది వెలమ సంఘం మచిలీపట్నం శాఖ కార్యాలయం వద్ద మాజీ అధ్యక్షుడు పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, పిల్లారిరిశెట్టి సత్యనారాయణ, మరకాని వాసు, మాదిరెడ్డి ఈశ్వర్ తదితరులు లబ్ధిదారులకు అందజేశారు.

ముగిసిన వీర సుంకులమ్మ తల్లి జాతర



పెడన: మండల పరిధిలోని పుల్లపాడు గ్రామంలో జోగి ఇంటి పేరు వారి ఇలవేల్పు, గ్రామ దేవత వీరసుంకులమ్మ జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత ఐదు రోజులుగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. ఆదివారం చివరి రోజు జాతర మహోత్సవాలు ముగింపు ప్రక్రియను ఘనంగా నిర్వహించారు. జోగి వారితో పాటు ఇతర భక్తులు సైతం పెద్ద ఎత్తున పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు జోగి సుబ్రహ్మణ్యం సహకారంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించారు. పెడన ఎస్ఐ గంట్ల సత్యనారాయణ, సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు

- గ్రామాల్లో ఎక్కడ చూసినా మట్టి అక్రమ రవాణా
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు
- కూటమి నేతల తీరుపై మండిపడుతున్న ప్రజలు



బందరు మండలం పోతేపల్లి గ్రామంలో మట్టి రవాణా

కోనేరుసెంటర్ : రెవెన్యూ అధికారుల మొద్దు నిద్ర కూటమి నేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది. గ్రామాల్లో ఎక్కడ చూసినా మట్టి ట్రాక్టర్లు రేసుగుర్రాల్లా పరుగులు పెడుతున్నాయి. రాత్రీపగలూ తేడా లేకుండా రోడ్లపై చక్కర్లు కొడుతున్నాయి. మట్టి దిబ్బలు కనబడితే చాలు కూటమి నేతలు వాటిని తరలించుకుపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే అటు తెలుగుతమ్ముళ్లు, ఇటు జనసైనికులు మట్టిని తెగ మింగేస్తున్నా రెవెన్యూ అధికారులు మాత్రం మాకు తెలీదు.. మేము చూడలేదు.. అంటూ తప్పుకుంటున్నారు.

రాత్రీపగలూ..

మండలంలో మట్టి మాఫియా అవతారమెత్తిన కూటమి నేతలు మొన్నటి వరకు చీకటిలో మట్టిని తరలించారు. ఇటీవల పెద్దల ఆశీస్సులు పొందారో ఏమో కానీ పగలూరాత్రీ తేడా లేకుండా మట్టి దిబ్బలను బద్దలు కొట్టి లక్షల ఖరీదు చేసే మట్టిని అమ్మేసుకుంటున్నారు. ఈ అవినీతి దందాలో అటు తెలుగుతమ్ముళ్లు ఇటు జనసైనికులు పోటాపోటీగా తలపడుతున్నారు.

అధికారుల ఎదుటే..

మండలంలోని అనేక గ్రామాల్లో ఈ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరించటంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. గతంలో గుట్టు చప్పుడు కాకుండా మట్టిని తరలించిన నేతలు ఇప్పుడు రెవెన్యూ సిబ్బంది కళ్లెదుటే దర్జాగా దోచుకుపోతున్నా అడ్డుపడకపోవటమే ఇందుకు ఉదాహరణగా మండల ప్రజలు మాట్లాడుకుంటున్నారు.



పెదయాదర గ్రామంలో జరుగుతున్న మట్టి దందా

పోర్టు భూములే లక్ష్యంగా..

మండలంలోని సీఆర్‌డీఏ పరిధిలో ఉన్న పోర్టు భూములను టార్గెట్‌గా చేసుకుని తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు మట్టిని దోచుకుపోతున్నారు. ఈ అక్రమ వ్యాపారంలో అక్రమార్కులకు కాసుల వర్షం కురుస్తోంది. గోపువానిపాలెం, మంగినపూడి, తపసిపూడి, కరగ్రహారం, తాళ్లపాలెం, చినకరగ్రహారం తదితర గ్రామాల్లో ఇప్పటికే వందల ఎకరాల్లోని మట్టిని కూటమి నేతలు దోచుకుపోయారు. ఈ మట్టి దందాకు ఆయా గ్రామాల్లోని తెలుగుదేశం, జనసేన నాయకులే నాయకత్వం వహిస్తున్నారు.

స్పందించని అధికారులు..

ఆయా గ్రామాల మీదుగా నగరంలోకి తరలిస్తూ ట్రాక్టర్ మట్టిని రూ.2000 పైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే ఇళ్ళ మెరకల కోసం, ఇతర అవసరాలకోసం తరలించి ట్రాక్టర్ మట్టిని రూ.1000 పైగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతున్నా పట్టించుకునే నాథుడు ఉండటం లేదు. మట్టి తరలింపును అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు, సిబ్బంది నోరు మెదపకుండా ఉండేందుకు కూటమి నేతల అవినీతి సంపాదనలో వారిని భాగస్వాములు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పొలాల్లో మట్టిని కూడా..

ఇదిలా ఉండగా పెద్ద పెద్ద నాయకులు బందరు మండలంలోని పోర్టు భూముల్లోని మట్టిని మింగేస్తుండగా పోతేపల్లి, సిరివెళ్లపాలెం, కొత్తపూడి, పిళ్ళారిశెట్టిపాలెం, బొర్రపోతుపాలెం, పెదయాదర, చిన్నాపురం, రుద్రవరం తదితర గ్రామాల నుంచి పొలాల్లోని మట్టిని ఎలాంటి అనుమతులు లేకుండా ఆయా గ్రామాల్లోని నేతలు తరలిస్తున్నారు. జేసీబీలను పెట్టి ట్రాక్టర్‌ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకుంటున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ పర్వదినం



పెడనలో ఈస్టర్ పర్వదినంలో క్రీస్తు విశ్వాసులు



పటాన్‌పేటలోని షారోన్ గాస్పెల్ చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్ తిమోతి



చల్లపల్లి ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థనలు



మచిలీపట్నంలో ఈస్టర్ సందర్భంగా ప్రదర్శన

పెడన: మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో ఈస్టర్ పర్వదినం వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెడనలో ఏసు ప్రభువు పునరుత్థాన మహోత్సవాన్ని పురస్కరించుకుని క్రీస్తు విశ్వాసులు, క్రీస్తు భక్తులు శుభ శుక్రవారం తరువాత వచ్చిన ఆదివారం ఈస్టర్ పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం అర్థరాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు కూడా ఏసుక్రీస్తు లోక కల్యాణం, పాపులను రక్షించడం కోసం తిరిగి రావడాన్ని ఆర్సీఎం చర్చి ఫాదర్ ఎస్. జోజప్ప భక్తులకు తెలియజేశారు. దివ్యబలిపూజలో భాగంగా జ్యోతి అర్చన, వాక్య అర్చన, జ్ఞానస్నాన అర్చన, కృతజ్ఞత అర్చన నిర్వహించారు. అనంతరం 20 వసంతాల గురుపుజోత్సవం సందర్భంగా ఆత్మీయ గురువర్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిమంది క్రైస్తవ విశ్వాసులు పాస్కా (ఈస్టర్) పండుగలో పాల్గొన్నారు.

గూడూరు: క్రీస్తు పునరుత్థానం చెందిన దినంగా భావించే ఈస్టర్ పవిత్ర దినాన్ని మండలంలోని క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గూడూరులోని షాలెం ప్రార్థనా మందిరంలో పాస్టర్ ఏసుపాదం ఆధ్వర్యంలో ప్రత్యేక పార్థనలు జరిగాయి. పటాన్‌పేటలోని షారోన్ గాస్పెల్ చర్చిలో పాస్టర్ లింగం తిమోతి ఈస్టర్ సందేశం ఇచ్చారు. వివిధ గ్రామాల్లో ఈస్టర్ పర్వదినాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

చల్లపల్లి: ఏసుక్రీస్తు పునరుత్థాన పండుగ (ఈస్టర్)ను పురస్కరించుకుని ఆదివారం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, బోధనలు, గీతాలు ఆలపించారు. మండల పరిధిలోని సాలిపేట ఆర్‌సీఎం చర్చిలో ఈస్టర్ సందర్భంగా రాత్రి గం.11ల నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ తిరిగి ఉయదం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఫాదర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారు జామున దైవ సేవకులు కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు గీతాలు ఆలపించారు. గత 40 రోజుల నుంచి కొనసాగిస్తున్న ఉపవాస దీక్షలను ఈస్టర్ డే రోజున ముగించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిచారు.

ఘంటసాల: మండలంలో ఈస్టర్ వేడుకలు ఆదివారం క్రైస్తవ విశ్వాసులు, ప్రజలు భక్తి శ్రద్ధలతో



ఉత్తరచిరువోలులంకలో ర్యాలీ

జరుపుకున్నారు. గిల్గాలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘంటసాల, తాడేపల్లి చర్చిల్లో జరిగిన ఈస్టర్ ఆరాధనలో పాస్టర్ కె.దానియేలు రాజు, నవీన్ బాబు, సతీష్ పాల్, దాని, దైవజనురాలు కావూరి దేవమణి ధనరాజు సందేశమిచ్చారు. ఆయా చర్చిల్లో ప్రేమవిందు ఏర్పాటు చేశారు. ఘంటసాల, కొడాలి బాపిస్టు చర్చిల్లో రెవ.ఎండీవీ ప్రసాద్, మట్టా సునీత్, సునీల్, ఇతర చర్చిల్లో దైవజనులు కె.దానియేలు, ఎ.యేసు, సీహెచ్.దానియేలు, షాలేమ్, కె.యేసు పాదాలు, యండకుదురు, కొడాలి, తెలుగురావుపాలెం, శ్రీకాకుళం, పాపవినాశనం, దాలిపర్రు చర్చిల్లో పాస్టర్లు శీరం సుందర్ సింగ్, గుడిసేవ ప్రదీప్, కావూరి ప్రకాష్, షాలేమ్‌రాజు, శేఖర్, యేసు ముత్యాలు, గోవాడ శ్యామ్‌బాబు, బాప్టిస్లు, ఆర్‌సీఎం, సీఎస్ఐతో పాటు మండలంలోని అన్ని చర్చిల్లో మట్టల ఆదివారం వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

మచిలీపట్నంటౌన్: యేసుక్రీస్తు పునరుత్థానం చెందిన దినం జీవించే ఆశకు కొత్త జన్మనిచ్చిన రోజు పవిత్ర ఈస్టర్ పర్వదినం సందర్భంగా స్థానిక బెరాకా చర్చి సంఘస్తులు ఆదివారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శన ప్రధాన రహదారుల నుంచి సాగింది. ఈ సందర్భంగా ఏసు ప్రభువు మరణం, పునరుత్థానం, త్యాగం గురించి పాస్టర్లు వివరించారు, అలాగే నగరంలోని ఆనందపేట యూత్ ఆధ్వర్యంలో ఈస్టర్ సందర్భంగా పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు చర్చి పాస్టర్ వెరీ రెవరెండ్ సీఎల్ జాస్పర్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఈస్టర్ విశిష్టతపై వాక్యోపదేశం చేశారు.

అవనిగడ్డ: ఏసుక్రీస్తు సిలువ వేయబడి తిరిగి పునరుత్థానుడై లేచిన సందర్భంగా విశ్వాసులు ఈస్టర్ ఈ పండుగను చేసుకుంటారు. మండలంలోని పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కోటగిరిలంకలోని ఆర్‌సీఎం చర్చి ఫాదర్ సురేష్ మెర్లో ఆధ్వర్యంలో ప్రధాన రహదారి పక్కనున్న తల్లి ఒడిలో తనయ గుహ నుంచి చర్చి వరకు కొవ్వొత్తులతో ప్రదర్శన చేశారు. అనంతరం చర్చి ఆవరణలో నూజివీడు విచారణ గురువు మరియదాసు, ఫాదర్ విజయ్, బ్రదర్ విజయరాజు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొంతమందికి బాప్తిజం ఇచ్చారు. అనంతరం విశ్వాసులకు బన్నులు పంపిణీ చేశారు. పలువురు సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలోని పలు గ్రామాల్లోని ప్రార్థనా మందిరాల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ బీలీవర్స్ చర్చ్ పాస్టర్ ఐజక్ స్టీఫెన్ సందేశమిచ్చారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, మానవహారంతో ప్రభువు పాటలు ఆలపించారు.



కోటగిరిలంకలో కొవ్వొత్తుల ప్రదర్శన



ఘంటసాల గిల్గాలు చర్చిలో..

పేద వధువుకు ఆర్థిక సాయం



మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరానికి చెందిన పేద వధువు శ్రీ సాయిసత్యవతికి వివాహ ఖర్చుల నిమిత్తం ఆ సంఘ ప్రతినిధులు రూ.22 వేలను అందజేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు ఎ.మణిరత్నం పంపిన ఈ మొత్తాన్ని క్లబ్ రీజినల్ కోఆర్డినేటర్ వేముల శిరీష గృహం వద్ద నూతన వధువుకు అందజేశారు. దాతల సాయంతో ఆమెకు ఆరు చీరలు, వెండి మెట్టెలు అందజేశారు. ఈ నెల 23న వివాహ ముహూర్తం ఉండటంతో వివాహ ఖర్చుల కోసం ఈ మొత్తాన్ని అందజేశామని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఐపీసీ యెండూరి సురేష్, ఆర్ఎస్ అన్నం అశోక్, జడ్‌సీ తమ్మన అనూరాధ, క్లబ్ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు జల్లూరి రాంబాబు, కార్యదర్శి జయవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధం

గోగినేనిపాలెం(ఘంటసాల): మండలంలోని గోగినేనిపాలెంలో ఐదు ఎకరాల వరిగడ్డి వామి దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మొవ్వ ఫైర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. కుంపటి వెంకటేశ్వరరావుకు చెందిన ఐదు ఎకరాల వరిగడ్డి వామిలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసి మొవ్వ ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎల్ఎఫ్ఐసీ ఏవీ పూర్ణచంద్రరావు, డీఓపీ జి.శ్రీను, హోం గార్డు ఫైర్‌మెన్ డిఎస్ఆర్కే ప్రసాద్ మంటలను అదుపు చేశారు. సుమారు రూ.60 వేలు ఆస్తినష్టం జరిగినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

బంటుమిల్లి: మండల పరిధిలోని పెందుర్రు గ్రామం వద్ద ఆదివారం 216 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. రోడ్డుపై ఉన్న గేదెను తప్పించబోయిన కారు డ్రైవరు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ప్రమాదం గుర్తించిన వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం బందరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ గణేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన విషయం నిజమేనని అయితే ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



ముగింపు కార్యక్రమంలో కరపత్రాలు అందజేస్తున్న అగ్నిమాపక అధికారులు

బంటుమిల్లి: స్థానిక అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీవో జి.శివరామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ అధికారులు, సిబ్బంది చెప్పిన జాగ్రత్తలను పాటించాలన్నారు. సీనియర్ ఫైర్ అధికారి జీ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించి, కరపత్రాలు అందజేసి వేసవిలో సంభవించే ప్రమాదాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభాకరరావు స్ఫూర్తిగా పేదలకు సేవ చేయాలి



మణి ప్రభాకరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పలువురు ప్రముఖులు

చల్లపల్లి: మణిప్రభాకరరావు మరణానంతరం కూడా తన పార్థివ దేహాన్ని వైద్యశాలకు దానం చేసి సమాజ సేవలో పాల్గొన్నారని పలువురు వక్తలు కొనియాడారు. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొక్కిలిగడ్డ మణిప్రభాకరరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో ఆదివారం సంతాప సభ నిర్వహించారు. తొలుత మణిప్రభాకరరావు చిత్రపటం వద్ద పుష్పగుచ్ఛాలు, పూలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను చేరదీసి వారికి విద్యాబుద్ధులు చెప్పి ఉన్నతులుగా తీర్చిదిద్దటంలో మాష్టారు పాత్ర వెలకట్టలేనివని కొనియాడారు. సుమారు 150 మందికి పైగా ఆయన సహయ సహకారాలు అందించారన్నారు. ఆయన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది పేదలకు విద్యాదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మల్లుపెద్ది అజయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యులు శ్రీహరి, స్వచ్ఛ సుందర చల్లపల్లి రథసారధి డాక్టర్ డీఆర్‌కే ప్రసాద్, వక్కలగడ్డ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు హనుమానుల సురేంద్రనాథ్‌బెనర్జీ, రిటైర్డ్ ఈఓఆర్డీ దాసి సీతారామరాజు, కుటుంబ సభ్యులు, లయన్స్ క్లబ్ సభ్యులు, స్వచ్ఛ చల్లపల్లి కార్యకర్తలు, పూర్వ విద్యార్థులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

చల్లపల్లి: ప్రజలకు మెరుగైన సేవలు అందించటంలో వాసవీ క్లబ్ ముందు వరుసలో ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక క్లబ్ కార్యాలయంలో ఉచిత హోమియో, కంటి పరీక్షలు, పెయిన్ రిలీఫ్ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మునుముందు మరిన్ని సేవలు ప్రజలకు అందించాలని కోరారు. తమ్మన సతీష్ కుమార్తె వెంకట కుందన దాతృత్వంతో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో వైద్యులు బొగ్గవరపు మోహనరావు 171 మందిని పరీక్షించి వారిలో 40 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డాక్టర్ తమ్మన మణికంఠచే నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 63 మందిని, డాక్టర్ సాయి పాల్గొన్న పెయిన్ రిలీఫ్ శిబిరంలో 45 మందికి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వాసవీ క్లబ్ రీజియన్ ఛైర్‌పర్సన్, సెక్రటరీలు వేముల శిరీష, అన్నం అశోక్‌కుమార్, జడ్‌సీ యండూరి జగన్‌మోహనరావు వాసవీ క్లబ్ ప్రాంతీయ కార్యాలయాన్ని సందర్శించారు. మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని, ఉచిత అమృత ధార మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభించారు. చల్లపల్లి గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వాసవీ క్లబ్ సభ్యులు మాజేటి అమరవాణి, దింటకుర్తి జ్యోతి, వెంకటరత్నం, జూపూడి కిరణ్, ఉరిమి రమేష్, ప్రసాద్, ద్రోణ, సాయికుమారి, జల్లూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

నాగాయలంక: స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో కొలువైన శ్రీపోతురాజుస్వామి దేవస్థనంలో అన్నదాన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 200 మంది పేదలకు అన్నదానం చేశారు. దాతలు కుర్రా చంద్రబాబు, లావణ్య, నయన ఆర్థిక సహకారంతో 200 మందికి భోజన కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈఓ తలశిల రామయ్య చౌదరి, అరుణ దంపతులు, ఉప్పల సురేషబాబు, నిర్వాహకులు గడ్డిపాటి ప్రసాద్, ఉప్పల లీలాకృష్ణప్రసాద్ (బుజ్జి) కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు..

స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో దాతల విరాళంతో నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఆకుతోట సుబ్బారావు ఆయన కుమారుడు సీతారామయ్య కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో 50 మందికి భోజనాలు సమకూర్చారు. తొలుత దాతలు సుబ్రహ్మణ్యేశ్వరునికి, నాగపుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పొన్నపల్లి చిన్నా పర్యవేక్షణలో పలువురు సేవలందించారు.

నేడు ఘంటసాల హెరిటేజ్ వాక్



ఘంటసాల: ఘంటసాల ఔన్నత్యాన్ని తెలియజేసేందుకు సోమవారం నిర్వహిస్తున్న ఘంటసాల హెరిటేజ్ వాక్ విజయవంతం చేయాలని ఎన్నారై గొర్రెపాటి రంగనాథబాబు అన్నారు. ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహం వద్ద మాట్లాడారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ మాట్లాడుతూ గాయకుడు ఘంటసాల 1967 ఏప్రిల్ 21న గ్రామానికి విచ్చేసి మూడు గంటలు పాటల కచేరి నిర్వహించారని, ఆ రోజును పురస్కరించుకుని ఉదయం 8 గంటలకు ఘంటసాల హెరిటేజ్ వాక్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రేడియో కళాకారుడు బలే వెంకటేశ్వరరావును సత్కరించారు. కొండపల్లి రామకృష్ణ, గొర్రెపాటి స్కూల్ ప్రిన్సిపాల్ లోయ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆశ్రమానికి పుచ్చ, దోసకాయల పంపిణీ



చల్లపల్లి: స్థానిక పార్వతమ్మతోటలోని కోట వెంకటసుబ్బారావు ఆదరణ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మండల పరిధిలోని లక్ష్మీపురానికి చెందిన వేమూరి విజయ్, యామిని దంపతులు ఆదివారం పుచ్చకాయలు, దోసకాయలను ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. వేసవి కావటంతో చలువ చేసే పుచ్చకాయలతోపాటు దోసలను పంపిణీ చేసినట్లు వారు పేర్కొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వివిధ పార్టీల నేతలు

కోడూరు: స్థానిక టీఎస్స్టార్ గ్రూపు ఆధ్వర్యంలో ఈస్టర్ సందర్భంగా ఆదివారం చలివేంద్రాలను ప్రారంభించారు. గ్రూపు అధినేత తిరుపతి శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రధాన సెంటర్‌లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వేసవిలో పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఉపయోగపడతాయని శ్రీనివాసరావు తెలిపారు. తొలిరోజు పాదచారులకు మజ్జిగను అందించారు. వివిధ పార్టీల రాజకీయాల నేతలు పాల్గొన్నారు.